# ఎడారి బతుకులు

## పల్లెకతలు



ఎండపల్లి భారతి

# ఎదారి బతుకులు

పల్లెకతలు

© ఎండపల్లి భారతి

విడుదల : మార్చి 2018

ప్రతులు : 1000

అట్టమీది &
లోపలి బొమ్మలు : బి.కిరణ్‌కుమారి
అట్ట అలంకరణ &
డిటిపి : ఎం.గిరివర్మ, తిరుపతి

వెల : రూ. 100/-

ప్రతులకు : ఎండపల్లి భారతి +91 9652802460
వి.జయంతి +91 9652802461
బి.కిరణ్‌కుమారి +91 8374465194
పూదోట శౌరీలు +91 9010153505

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాదు.
ఫోను:27678411

# సోలుపు


| | | |
|---|---|---|
| ఇత్తలిబిందె | - | 13 |
| అవ్వ తలపులు | - | 17 |
| సావు బియ్యము | - | 24 |
| దప్పి | - | 28 |
| మాయన్న సదువు | - | 32 |
| గంగులవ్వ మజ్జిగ | - | 36 |
| వాసాలమింద కప్పడం | - | 40 |
| పూలపెట్ట | - | 45 |
| బొగ్గులబట్టి | - | 51 |
| ఈరవ్వ ఏమి తినబెట్టిందో! | - | 54 |
| గంగమ్మె బెదిరిపోయె | - | 57 |
| గురువుదేవర | - | 60 |
| తాగుబోతు | - | 62 |
| అంటిత్తులు | - | 65 |
| నక్కాముట్టి | - | 67 |
| మొగుని పోటుకులు | - | 70 |
| కుట్టేవానికి మెట్టు కరువు | - | 75 |
| సచ్చి సాదించడం | - | 79 |
| తడిక తోసింది ఎవరు? | - | 84 |
| పాపం గెంగవ్వ | - | 87 |
| బొగ్గు దవడకేసుకుని | - | 91 |
| చిక్కొంటుకులు | - | 93 |
| సచ్చినోళ్ల గేపకం | - | 96 |
| కడుపులు కాల్చిన కందిబేడలు | - | 100 |
| తప్పేది ఒప్పేది | - | 104 |
| నల్లడబ్బు | - | 108 |
| సమేదాసరి | - | 115 |
| పసావు | - | 119 |
| ఆవైతే పేయ దూడ ఆడదైతే మగపిల్లోడు | - | 123 |
| ఎదారి బతుకులు | - | 128 |



# అవ్వ తలపులు

నడుము వంగిపోయిన మూడుకాళ్ల ముసిలి మా లచ్చుమవ్వ. అడుసుమడికి గెనాలు వేసినట్ల ముడతలు పడిన మొకము అవ్వది. నొస్టన వీబూది బొట్టు, చెవులకు ఎఱ్ఱరాళ్ల కమ్మలు, పిల్లాచెవులకు బుగుళ్లు, చెవుల చుట్టూ బావిరిళ్లు, కోటేలి తీసినట్లు ఉండే ముక్కు, ముక్కుకు ఒకపక్క చెందరంకి పుల్ల, రెండోపక్క పన్నెండురాళ్ల ముక్కుపుల్ల, మెడలో గుండ్లదండ, దానికి టీకాబిళ్ల, చేతులకు వెండి కడియాలు, నడుముకు గజ్జెల వడ్డాణం, కాళ్లకు తుమ్మకాయ కడియాలు, ముంజేతుల వరకు రయిక, చేతుల రెట్టలకాడ సీతమ్మ బాజిగాలు పచ్చ, కుడిచేతి మోచేతి కింద ఇండ్ల పచ్చ, ఎడమ చేతిమింద పీటముగ్గు పచ్చ, దానికిదిగవ వాళ్ల అమ్మపేరు పచ్చ, ఇన్ని పచ్చలతో చింతమాను చిగిరినట్లుండే చేతులు, పావడ లేకుండా కట్టే పన్నెండుమూర్ల కోకకు ముందు పదిరవయి కుచ్చిళ్లు, వెనక వేలాడే రెండు మూర్ల కొంగు, గాలి తీసేసిన ఊపిరిబుడ్డల మాదిరి వేలాడతా గుండెలమింద నింటి బొగ్గిటి కాడికి జారిన రొమ్ముకట్టు, ఆ రొమ్ముకట్టుకు పోటీగా గొంతులో వేలాడతుండే నల్లదారం, ఆ దారంలో మండిముల్లు, గుబిలిగెంటి, అంత్రం – ఎన్ని అగసాట్లు

వచ్చినా పోగొట్టుకోకుండా పెట్టుకోనుండే అయ్యి అన్నీ వెండివే – పాపిట్లో వెంటుక పడకుండా నున్నంగా దువ్వి ముడికట్టిన జుత్తు, అడివినింటి కొట్టుకొచ్చి, చేపట్టు తావున వెండిరేకును తాపిడించుకున్న ఊడగ దొన్నికట్టి, అలికిన పొయ్యిలో నిప్పులు మండినట్లు, బొక్కినోటినిండా వక్కాకు...ఇదీ మా అవ్వ రూపు.

మాయవ్వను చూస్తే చాలు నాకు కొండంత దైర్నం. ఆయమ్మ మొగంలో అంత కళ ఉంటాది. కడగండ్లకు కుంగిపొయ్యేది కాదు. మాయవ్వ మాట్లాడితే, కడవంత కస్టాన్ని మోస్తుండే వాళ్లయినా కలకల నగాలసిందే. సచ్చే సావుదల్లో కూడా యిగటకొయ్యి మాటలే. ఆకలి అంటా ఎవరయినా వస్తే, తాను తినేదాన్నయినా పెట్టేస్తాది. ఊర్లో ఆలూమొగుళ్లకు గలాటలొస్తే తీరస్తాది. కొప్పులో పూలు ఏమారేదే లేదు. నాట్లేసేచోట పదమెత్తుకొనిందంటే, గెనాలమింద పొయ్యేవాళ్లు అట్లనే నిలబడిపోతారు, అంత బాగుంటాది గొంతు. మొలకలపున్నానికి జక్కీకు ఆడిందంటే, ఊరు ఊరంతా ఆడనే ఉంటాది. పండగయినా పబ్బమయినా, పెండ్లయినా పుటకయినా, మాయవ్వే పెద్దదిక్కు.

“ఆ వయసులో గుద్దితే పగిలేటిగా ఉండేదాన్ని లేమ్మే” అంటుంటాది మా అవ్వ నాతో, ఇబ్బుడేమో తక్కువయినట్లు. కాటికి కాళ్లుసాపుకుని ఉండే ఈ వయసులో గూడా తాటికాయంత సంగటిముద్దని ఎగరేసి మింగేస్తాది. మాయవ్వని మావోళ్లు అందురూ “ఏమే ముసిలీ, నీకేమి గుద్దలో గోరోజనం ఉందేమే” అని ఎగతాళి పడతుంటారు. అంత గట్టి ముసిల్ది.

ఇంతకూ ఈ లచ్చుమవ్వ ఎవురో కాదు. మాయమ్మకు అమ్మ. చిన్నబిడ్డబుడే అమ్మని పోగొట్టుకున్న నేను, అనెంక మాయవ్వకాడనే పెరిగితిని.

ఆపొద్దు నేనూ మాయవ్వా తెట్టు తిర్నాలకు పోతా ఉండాము. ఆ తిర్నాలకు పోవల్లంటే మూడుమైళ్లు నడిసిపోవల్ల. నేను సంచితో, మాయవ్వ ఊతకట్టితో యెల్లబారితిమి. దోవ పొడువుకూ గుంపులు గుంపులుగా అందురూ తిర్నాలకు పోతా ఉండారు. మాయవ్వ బిరిన్నా నడలేదు కదా, దాన్నింటి మేము మెల్లింగా పోతా ఉండాము.

ఈ ముసిలిదానితో పొయి ఈపొద్దు తిర్నాలని చూసినట్లే అనుకుంటా, “అవా, తిర్నాల్లో నాకు అన్నీ తీసియ్యాల్ల” అంటిని. “అట్లే లేమ్మే” అనింది అవ్వ. పోతా ఉండాము. దోవలో తీపి చింతమాను కనపడింది. నేను మాయవ్వను వదిలేసి పరిగెత్తి పొయి, తీపిచింతకాయల్ని ఏరుకోని తింటా ఉండాను.



# దప్పి

నాకు ఎనిమిదేళ్లబ్బుడు జరిగిన కత ఇది. అబ్బుడు నాకు అమ్మతల్లి పోసింది. అమ్మతల్లిలో చానా రకాలు ఉండాయి. నాకు పోసిందేమో కుండ్లమ్మ. ఒళ్లంతా ముత్తెమంత ముత్తెమంతగా ఆపుగోపాలమంత సందు గూడా లేకుండా పోసేసినాయి. మా నాయిన మమ్మల్ని పట్టించుకునేదే లేదు. ఎబ్బుడూ తాగి తలకు పోసుకుంటా ఉండేవాడు. మాయమ్మ ఒకతే కూలినాలి చేసి మమ్మల్ని సాకేది. నాకు అమ్మతల్లి పోసినబ్బుడు గూడా మా నాయన పట్టించుకోలేదు. మాయమ్మే ఎన్నోపాట్లు పడి నన్ను ఎక్కడెక్కడ్నో చూపించింది. కానీ నాకు తగ్గలేదు.

మా పాట్లు ఇట్లుంటే మా ఊర్లో గంగజాతర మొదులుపెట్టిరి. జాతర కోసరం, మా పెద్దమ పిల్లోళ్లయిన మా అన్నా చెల్లెలూ, ఇంటికి వచ్చిండారు. ఊర్లో ఎవురికైనా అమ్మతల్లి పోసుంటే జాతర చెయ్యకూడదంట. అట్ల చేస్తే అమ్మతల్లి ఉమ్మరంగా అవుతాదంట. మమ్మల్ని పట్టించుకోకుండా మా ఊరోళ్లు జాతర జరిపేసిరి. జాతర జరిగిన మరుసనాటి నింటి నాకు ఎక్కువయి పొయి, మూసిన కన్ను తెరవకుండా

పడిందానంట. ఊరి పెద్దోళ్లంతా వచ్చి నన్ను చూసి "ఇంగ ఈ బిడ్డ బతికేలేదు, ఊరి బయటకు తోడుకుని పోయి ఆడ పండపెట్టేసి రాండి" అని మాయమ్మతో చెప్పిరి. ఆ మాటలు విని మాయమ్మ గోడుగోడు అని ఏడస్తా ఉండాది. అట్లా పొద్దులో గూడా మా నాయిన సారాయంగడిని వదిలి రాలేదు. ఊరోళ్లంతా కలిసి ఊరి ముందర పందిలేసి, ఆ పందిలి కింద నన్ను పణుకోబెట్టిరి. అబ్బుడు పక్కూర్లో ఉండే సరోజమ్మ అనే పెద్దామె వచ్చి "మల్లమ్మా, రాయలపేటలో నీళ్లు మంతరి స్తారంట ఆడకి తోడుకుని పో" అని చెప్పిందంట. ఆ మాటతో మాయమ్మ అదరాబదరా లేసి, మాయన్నతో 'చెల్లెల్ని ఎత్తుకోరా' అని చెప్పి, నన్ను బుజాన వేసుకుని కాలిదోవన నడస్తా ఉండాది.

మా ఊర్నించి రాయలపేట పది కిలోమీటర్లు ఉంటాది. కాలి దోవన పోతా పోతా నడుమన ఉండే ఎర్రచేన్ల గడ్డ తావుకి చేరుకుంటిమి. పైన ఎండ దంచి కొడతా ఉండాది. ఆ ఎండకు నాకు దప్పికయింది. "అమా అమా తాగేకి నీళ్లు కావాలమా" అని మూలిగితిని. మా అన్న గూడా అడిగినాడు. ఎర్రచేన్ల గడ్డ తావున ఒక కాపుపల్లె ఉండాది. ఆ ఊర్లో ఉండేది అందురూ కాపోళ్లే. వాళ్లు మాదిగోళ్లనూ మాలోళ్లనూ ఊర్లోకి రానిచ్చేది లేదు.

ఆ ఊరి ముందర ఒక చేదబాయి ఉండాది. మాకు అబ్బుటికే నీళ్ల దప్పిక. ఆ కాపుపల్లె ఆమె, నీళ్లు చేది ఇంటికి ఎత్తుకుని పోతా ఉండాది. మాయమ్మ మమ్మల్ని చేదబాయికి దూరంగా నిలబెట్టి ఆమెను చూస్తా "ఓమ్మా, నా బిడ్లకు నీళ్ల దప్పుంటమ్మా కొంచెం నీళ్లు పొయ్యి తల్లీ" అని అడిగింది.

మాయమ్మ అడగతా ఉంటే ఆయమ్మ ముక్కునా చెక్కునా వేసుకోకుండానే నీళ్లు చేదుకుని ఇంటికి పొయ్యేసింది. నేనూ మాయన్నా "అమా నీళ్లు మా... దప్పయితా ఉంది మా..." అని అడగతా ఉంటే మాయమ్మ కళ్లల్లో చిటికినేలు లావు కన్నీళ్లు కారతా ఉండాయి. మాయన్న ఉండుకోని "అమా, నేను బాయికాడికి పొయి తాగేసి వస్తాను మా" అన్నాడు. "వద్దు కొడుకా, వాళ్లు కాపోళ్లు. మనం వాళ్ల బాయిని తాకితే మనల్ని దండిస్తారు" అనింది మాయమ్మ.

ఆ కాపోళ్లామె మల్లా బాయికాడికి వచ్చింది. మాయమ్మ మల్లా ఆమెని "తల్లీ, రవన్ని నీళ్లు పొయ్యమ్మా. బాగలేని బిడ్డమ్మా. గొంతు ఎండిపోతుండాదంటమ్మా" అని బతిమాలుకునింది. ఆయమ్మ పాటికి ఆయమ్మ నీళ్లుచేది బింది నింపుకోను, ఇంటికి ఎత్తుకుని పోనుగా ఉండాది కానీ మాయమ్మ మాటల్ని పట్టించుకోనే లేదు.



# వాసాలమింద కప్పడం

నేనూ నా జతగత్తె పద్మ ఇద్దరమూ కలిసి తెల్లగుఱ్ఱాలు కట్టిండే తేరునెక్కితిమి. మా తెల్లగుఱ్ఱాలతేరు పైకెగిరి నల్లమోడాలను రాసుకుంటా పోతుండాది. పొయ్యిపొయ్యి ఒక పెద్ద పూలతోటలో వదిలింది మమ్మల్ని. ఆ తోటంతా రకరకాల పూలచెట్లూ పండ్లమాన్లూ నిండిపోయిండాయి. పూలు పెరుక్కుని జడల్ని నింపుకుని, పండ్లతో ఒడులు నింపుకుంటా ఉండాము.

"మేయ్ బుజ్జీ, లెయిమే. ఆడబిడ్డ ఇంతవరకూ నిదరపోవచ్చా. పొద్దెక్కి బారడయింది. కాళ్లు నిగర తన్నుకుని పణుకోనుండావే, లెయిపైకి" అని నన్ను ఊపి ఊపి లేపతా ఉండారు ఎవరో. నేను గబక్కన లేసి కుచ్చుని అట్లా ఇట్లా బిత్తర చూపులు చూస్తి. తేరూ లేదు, పూలతోటా లేదు. ఎదురుగా మాయవ్వ మటుకు ఉండాది. 'ఇదంతా కలా' అనుకుని సాపమిందనే కుచ్చుని ఉండాను.

"లెయ్యే, ఈపొద్దు సుక్కురోరం. బిరిన్న పనులన్నీ చేసుకోని రాగవరెడ్డోళ్ల చేన్లోకి పనికి పోవల్ల" అంటా పనులు చేస్తా ఉండాది అవ్వ.

నేను కండ్లు పులుముకుంటా లేసి దొడ్లోకి పొయి పండ్లు దుద్దుకోని మొకము కడుక్కోని వస్తి. అంతలికే అవ్వ అన్ని పనులూ చేసేసి, పొయ్యిమింద ఎసుట్లో పిండిపోస్తా ఉండాది.

"అవా, తాత ఏడకి పొయినాడవా" అని అడిగితి.

"నిన్న రేతిరి ఇంటికే రాలేదు. ఆ సారాయంగడి కాడనే పొల్లాడతా ఉండాడేమో. సంగటిపొద్దుకు ముందో వెనకో వస్తాడులే" అనిందవ్వ. నేను అవ్వ వెనకాలకు పొయ్యి నిలబడుకుంటి.

"బుజ్జీ, నేను సంగటీ చారూ చేసేస్తాను. నువ్వు కుండ ఎత్తుకోని పొయ్యి బిరిన్న నాలుగు తడవలు నీళ్లు తేపో కొడుకా. అందరమూ నీళ్లు పోసుకుందాము" అనింది అవ్వ.

నేను కుండ ఎత్తుకుని బోరింగు కాడకి బయలుదేరితి. దోవలో పద్మ గూడా ఒక కుండ ఎత్తుకుని వచ్చింది. మేమిద్దరమూ బోరింగు కింద కుండల్ని పెట్టి, బోరింగును కొట్టి కుండల్ని నింపుకుంటిమి. ఆ బోరింగు పక్కన్నే చిన్నగుట్ట ఒకటి ఉంటాది. దానిపేరు కదిరిగుట్ట. ఆ గుట్టనిండా సీతాపలం చెట్లు నిండుకోని ఉంటాయి. మేము కుండల్ని అట్లే పెట్టి, సీతాపలం కాయలకోసరం గుట్టమిందకి పోతిమి. నేను చెట్ల గుబురుల్లో దూరి కాయలు కోసిస్తుంటే, పద్మ ఒడి నింపుకుంటా ఉండాది.

"ఓ పాపా, ఓ బుజ్జీ, ఏడకు పోతివే" అని మాయవ్వ కూత వినిబిచ్చేతలికి, గబగబా గుట్టను దిగితిమి. మాయవ్వ ఒక కడవను ఎత్తుకుని బోరింగు కాడకి వచ్చింది. కాయల్ని నింపుకుని చెక్కుకోనుండే మా ఒడుల్ని చూస్తా "ఏమే, నీకు చెప్పిన పనేమి, నువ్వు చేసే పనేమి, ఇంటికి రా నీ పని చెప్తా" అంటా కడవకు నీళ్లు నింపుకుని పొయింది. నేను గూడా కుండను ఎత్తుకుని అవ్వ వెనకాలనే ఇంటికి పోతిని.

"ఆ పరిగిలిదానికి పనీపాటా లేదు. దాని జతగూడి నువ్వూ చెడిపోతా ఉండావు. లెయ్యి, ఇంటెనకాల నీళ్లు పెట్టిండాను, పోసుకోపో" అని తిట్టింది అవ్వ.

సంగటిపొద్దుకు పనులన్నీ చేసేసి, నీళ్లు పోసుకుని, పమిదిలో దీపం పెట్టి, పటాలకు పూలు పెట్టి, దణ్ణం పెట్టుకునింది అవ్వ. "పాపా, సంగటిపొద్దు ఎక్కిపోయె.



# గంగమ్మె బెదిరిపోయె

మా జయక్క చానా చానా మంచిది. ఇంటి పనైనా బయట పనైనా అంతే వైనంగా చేస్తాది. అయితే ఆయమ్మి ఆకలికి ఓర్చుకోలేదు. పొద్దుకు అంత ముద్ద కడుపులో పడిపోవాల. పుట్నింటిలో ఉన్నెబుడు, కూడోకవళమో కాయోకరుసో ఏదో ఉండింది అంత తినేసి వేళకు కడుపు నింపుకునేది. అత్తింటికి పొయినంకనే పాపం ఆకలికి అంగలార్చింది జయక్క.

జయక్క మొగుడు, వాళ్లమ్మ మాటకు ఎదురు చెప్పడు. ఆ తల్లేమో సరిగ్గా తిండి పెట్టేదే కాదు. మాయక్క, ఇక్కనాపక్కనా ఉండే ఇండ్లోళ్లు ఏమన్నా అంత పెడితే తిని కడుపు నింపుకునేది. అది తెలుసుకుని, 'నా కోడాలికి లేనిపోనివి చెప్పించి మా కాపరాన్ని చెడిచేస్తా ఉండారు' అని వాళ్లను సాపించి సాపించి ఆ ముద్దా లేకుండా చేసింది. ఇట్ల ఇంటికూడూ దోవకూడూ రెండూ లేక అగసాట్ల పాలయింది జయక్క.

ఒకనాడు పుట్నింటికి వచ్చింది జయక్క. అక్క వచ్చిందని వాళ్ల నాయిన పేటకు పొయి సరుకులు తెచ్చినాడు. మా పెద్దమ్మ ఓలిగులు చేసి, తునకల చారు చేసి పెట్టింది. ఎన్నాళ్లయిందో కడుపునిండా తిని, కరువున పడినట్లు అసట్లబసట్ల తింటా ఉండాది అక్క. అది చూసిన మాయవ్వ, "ఒసే జయమ్మా, నువ్వు తినేది చూస్తుంటే నాకు ఒక కత గుర్తుకొస్తా ఉండాది, చెబతాను వినే" అంటా కతను మొదులుపెట్టింది.

"ఒక ఊర్లో నీ అత్త అట్లా అత్త, నీ అట్లా కోడాలు ఉన్నెంట. ఆ అత్తా మీయత్త మాదిరిగానే కోడాలుకు ఏమీ పెట్టేది లేదంట. ఆ కోడాలు తిండికి బెక్కిడిసిపొయింది. ఒకనాడు సంకురాతిరి పండక్కి, ఇంట్లో దోసెలు పోసి పితికిపప్పు కూర చేసిరి. ఇంట్లో తింటే వాళ్లత్త చూసి లబ్బన పడతాదనుకుని, నీళ్లబిందిలో దోసెలూ కూరా వేసుకుని పొయి, ఊరి ముందరుండే గంగమ్మ గుడిలోకి దూరి అసట్లబసట్ల తింటా ఉండాది. అదంతా చూసిన గంగమ్మ ముక్కుమింద వేలు వేసుకునింది. అనెంక ఎవరో ఆ దోవన పోతాపోతా, గంగమ్మ ముక్కుమింద వేలేసుకోనుండేది చూసి, బెప్పరపొయి ఊర్లో అందరికీ చెప్పిరి. దాంతో ఊరంతా ఉడ్డగూడి ఆ వింతని చూసి, ఊరికి ఏదైనా చెడ్డ జరగతాదేమో అని దిగులుపడిరి. ఎవరైతే గంగమ్మ ముక్కుమీది వేలును తీపిస్తారో వాళ్లకి దేవుని మాన్యంలో పదికుంటల నేలను రాసిస్తామని చుట్టుపక్కల ఏడూర్లలో చాటించిరి.

అందరూ విన్నట్లే ఆ చాటింపును ఆయాలి మొగుడూ విని, ఇంటికి పొయి దిగులుగా కుచ్చోనుండాడు. పెండ్లాము వచ్చి, ఏలట్ల కుచ్చోనుండావు అని అడిగింది. మొగుడు చాటింపు సంగతి చెప్పి, ఊరుకు ఏమైనా అయితుండేమో అన్నాడు. 'ఒసి దీనికేనా, పోయ్యా పోయ్యా, నా పెండ్లాము తీపిస్తాది అని చెప్పి, వక్కాకు తీసుకుని రాపో' అని మొగుణ్ణి పంపించింది.

ఇంట్లో వాళ్లందరికీ నీళ్లుపోసి, ఇల్లూ వాకిలీ అలికి, ఆయమ్మ నీళ్లు పోసుకుని కాయాకర్పూరం పూలూపండ్లూ తట్టకు పెట్టుకుని గుడికాడకి యెలబారింది. ఏడూర్ల జనం గుడికాడ గుమిగూడి ఉండారు. ఒక తెల్లగుడ్డను తెప్పించి వాకిలికి తెర కట్టించి, లోపలికి పొయింది ఆయమ్మ. పొయేటబ్బుడు ఎవరికంటా పడకుండా కుచ్చిళ్ల కిందన ఒక పొరకను పెట్టుకుని పొయింది. జనం గుడిబయట చెవులు కొరుక్కుంటా నిలబడి ఉండారు.

లోపలికి పొయిన ఆయమ్మ పొరకను బయిటికి తీసి గంగమ్మకు చూపిస్తా 'నా గంటు తింటి, నా మొగుని గంటు తింటి, నీగంటేమన్నా తింటినా. నేను తినింది



# నక్కాముట్టి

శివరేతిరి పండగ రాబోతా ఉండాదని మాకెట్ల తెలస్తాదంటే; మావూరి మగోళ్లు ఉడ్డజేరి, చేతినిండా చింతపిచ్చెలు పట్టుకుని, ఉడ్లరా నక్కరా మూడురా నాలుగురా అని పందేలు కాస్తా ఆడతా ఉంటారు. అది చూసినంక పండగ దగ్గిరికి వచ్చేసింది అనుకుంటాము.

పండగ పదైదు దినాలు ఉండాది అనంగా, మగోళ్లు పనీపాటులు మొగించేసి నక్కాముట్టి ఆటలో మునిగిపోతారు. చెయ్యి తిరిగిన ఆటగాళ్లు ఉండారు ఆయాటలో. చిన్నాటగాళ్లు, కొంచెం పెద్దాటగాళ్లు, పెద్దాటగాళ్లు ఉండారు. ఐదువేల నింటీ లచ్చల వరకూ పందేలు కడతారు. ఓడినోళ్లు గెలిచినోళ్లని అడిగి అప్పుచేసి మల్లా ఆడతుంటారు. పోలీసోళ్లు గుడకా ఆ మూడునాళ్లూ మా పల్లెల్లో గస్తీ చేస్తా ఉంటారు. రేపు శివరేతిరి ఉండాదనంగా, ఈపొద్దు రెయ్యంతా మరసనాడు మావిటాళ వరకూ ఆడతానే ఉంటారు. జాగారం అయితానే ఆడోళ్లూ పిల్లోళ్లూ

తిర్నాలకు పోతారు. ఆటలో గెలిచినోళ్లు పెళ్లాంబిడ్డల్ని సంబరంగా తోడుకుని పోతారు. ఓడినోళ్ల పెళ్లాంబిడ్డలు ఏడుసుకుంటా గోడాడుతుంటారు.

✡✡✡

నేనూ మాయత్తా మా చినమ్మా మా చెల్లెలూ అందరమూ కలిసి దేవరకొండ తిర్నాలకు పోతా, వెంకటలచ్చిమి చినమ్మని గుడకా పిలద్దామని వాళ్లింటికి పోతిని. వాకిటికాడ నిలబడి "తిర్నాలకి రావా మ్మా, సారిసారికి నువ్వే కదా ముందుగా మమ్మల్ని పిలస్తా ఉంటివి. ఈపొద్దు ఏలమ్మా ఇంటినింటి బయిటిక్కూడా రాలే, పిల్లోళ్లకి ఇంకా నీళ్లు కూడా పోసినట్ల లేదే" అని అడిగితిని.

ఆయమ్మ మొగం నల్లంగా పెట్టుకోని నట్టింట్లో కుచ్చుని యసనంగా, "నేను రాలేనులే పోండమ్మా" అనింది. ఆయమ్మ ముగ్గురు బిడ్డలూ, రెయ్యి ఉడకేసిన గుగ్గిళ్లని గిన్నిలో పోసుకుని తింటా ఉండారు.

"అయ్యో చినమ్మా, ఏల ఆ మాట అంటుండావే, ఏమి జరిగిందమ్మో" అంటిని.

"ఏంజెప్పేది లే నాయినా, మా ముండాకొడుకు రేతిరి నక్కామిట్టిలో అంతా పోగొట్టుకుని వచ్చి, సాలనిదానికి నన్నుకొట్టి, నాకాడ ఉండేదంతా పెరుక్కోని పొయినాడు. బిడ్డలని పస్తుబెట్టి, పండగపూట ఏమీ చేసుకోనీకుండా అంతా ఎత్తుకుని పొయి, వాడి మొగం మూసిపెట్టుకున్నాడు" అనింది.

"కాదమ్మా, ఆయాటకే పోనీకుంటే ఏమ్మా, పంపించేదేల వగిచేదేల?" అని అడిగితిని.

"పోయమ్మా, నేనేంటికి పోనిస్తా! ఏడుమైళ్లు కానీ వెతుక్కుంటా పోతాడు. ఈ శివరేతిరి పండగ ఏల వస్తాదో ఏమో, మా ఉసురు పోసుకునే దానికి" బదులు చెప్పింది ఆయమ్మ.

"ఎంత పొయింది చినమ్మా" అంటిని.

"కూలినాలి చేసి ఎత్తిపెట్టుకున్న దుడ్లు ఐనూరు రూపాయిలు, అయి చాల్లేదని నా ముక్కులోని ముక్కుపుల్లను కూడా పెరుక్కోని పొయినాడు. కొడవలిని కుదవ పెట్టేసినాడు, బియ్యం అమ్మేసినాడు. సాలనిదానికి, కూతకొచ్చిన మంచి కోడి పుంజును గుడకా పట్టుకుని పొయ్యేసినాడు" అంటా కండ్లనిండికీ నీళ్లు పెట్టుకునింది.

"ఒకేసారి, అన్నెట్లా ఎత్తుకోని పోనిస్తివి మా" తిరగా అడిగితిని.



# పాపం గెంగవ్వ

ఎబ్బుడూ కోడిగూజాముకి నిదర లేసేసే నేను, ఆపొద్దు లేసేటబ్బుటికి తెట్టంగా తెల్లారిపొయి ఉండాది. బిరబిర వాకిలి ఊడస్తా ఉండాను.

"ఏల బుజ్జమ్మా, ఇంత పొద్దెక్కినాక లేస్తివి" అంటా వచ్చింది మాయత్త.

"ఏలనో రెయ్యంతా నిదరే లేదత్తా. కోడిగూజాముకి రవంచ ముందు కన్ను కొరికుంటాను. లేసేదానికి ఇంత పొద్దాయె. నీ పన్లన్నీ అయినాయా" అంటిని.

"అయినాయి గానీ, నీకీ సంగతి తెలుసా, రాతిరి ఆ బంగితాతా గెంగవ్వలు మల్లా కొట్లాడుకున్నారంట. వాని రోక్కట తట్టుకోలేక, కొత్తిండ్లల్లోని బూబక్క ఇంట్లో తలదాచుకునిందంట ఆయవ్వ" అనింది అత్త.

"ఏమంటమ్మా ఆ బంగి నాబట్టకు పొయ్యేకాలము. ఈ వయసులో గూడా ఆయవ్వని కొట్టే పనేనా. ఆయవ్వ ఏమన్నా అయిపోతే, వానికి నీళ్లు పోసే దిక్కు గూడా లేకుండ, దిక్కులేని సావు సస్తాడు" అంటిని.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Yedari+Batukulu**

* * *